పత్రికా ప్రకటన - 1 ఒంగోలు

తేదిః 15.06.2020

ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలని, అనుబంధ శాఖల అధికారులు కలిసి పనిచేయాలని జిల్లా కలెక్టర్ శ్రీ పోల భాస్కర్ చెప్పారు. సంతనూతలపాడు, కొండేపి, ఒంగోలు, దర్శి నియోజకవర్గాలలో కొనసాగుతున్న ఉపాధిహామీ పనుల పురోభివృద్ధిపై సోమవారం స్థానిక స్పందన భవనంలో ఆయన సమీక్ష నిర్వహించారు.

గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్, సి.సి.రోడ్లు, సైడు కాలువలు, పాఠశాలల ప్రహరీ గోడలు, అంగన్‌వాడి కేంద్రాల నిర్మాణ పనులపై పర్యవేక్షణ కొరవడిందని కలెక్టర్ తెలిపారు. సంతనూతలపాడు నియోజకవర్గంలో రూ.57.21 కోట్ల తో వివిధరకాల పనులు మంజూరు చేయగా ఇప్పటివరకు కేవలం రూ. 2.47 కోట్ల విలువైనపనులు జరిగాయన్నారు. అభివృద్ధి పనులు యుద్ధప్రాతిపధికన చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సచివాలయాల నిర్మాణం పనులను ప్రాధాన్యతగా తీసుకోవాలని ఆయన సూచించారు. పురోగతి సాధించడానికి క్షేత్రస్థాయిలోని అధికారులంతా సమన్వయంతో పనిచేయాలన్నారు. ముఖ్యంగా ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధుల సూచనలు, సలహాలు తీసుకోవాలని ఆయన చెప్పారు. నిర్మాణ పనులు నత్తనడకన సాగడంపై మండలాల వారీగా ఆయన సమీక్షించారు. ఒకవైపు సిమెంట్ కొరత, మరో వైపు ఇసుక సమస్య జఠిలమైందని మండలస్థాయిలోని ఇంజనీరింగ్ అధికారులు కలెక్టరు దృష్టికి తెచ్చారు. స్పందించిన కలెక్టర్ సిమెంట్, ఇసుక ఇండెంట్ ప్రకారం ఆయామండలాలకు ఎందుకు చేరడం లేదని ఆరా తీశారు. ఇండెంట్ పంపడం, సరఫరా అయ్యే సిమెంట్, ఇసుక పై నావద్ద వివరాలు లేవని వాటిని డిప్యూటి ఇంజనీర్లు పర్యవేక్షిస్తున్నారని పంచాయితిరాజ్ ఎస్.ఇ. కలెక్టర్‌కు వివరించారు. ఇచ్చిన ఇండెంట్ ప్రకారం సిమెంట్ కంపెనీలు సరఫరా చేయడం లేదని ఎస్.ఇ. కి వివరించామని డిప్యూటి ఇంజనీర్లు కలెక్టర్‌కు తెలిపారు. దీనిపై తీవ్రంగా స్పందించిన కలెక్టర్ చిన్న పిల్లల మాదిరిగా ఒకరిపై ఒకరు చెప్పుకోవడం మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. బాధ్యతగా విధులు నిర్వర్తించాల్సిన జిల్లా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం మంచిపద్ధతి కాదని ఆయన మందలించారు. పద్ధతిమార్చుకొని చిత్తశుద్ధితో పనిచేయాలని ఆయన సూచించారు.

ఇండెంట్‌కు తగినట్టుగా సిమెంట్ సరఫరా చేయలేకపోతున్న ఆయా కంపెనీలకు నోటీసులు పంపాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అధికారులు గుడ్డిగా పనిచేయడం తగదని, అభివృద్ధిలో క్రియాశీలకంగా వ్యవహరించాలన్నారు. జులైలో నిర్వహించే సమీక్షలో పురోగతివుండాలని, లేకుంటే బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. కొండేపి నియోజకవర్గంలో రూ. 85.74 కోట్లతో వివిధ రకాల నిర్మాణ పనులు వేగంగా చేపట్టాలన్నారు. ప్రస్తుతం రూ. 12.18 కోట్ల పనులు మాత్రమే జరగడంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాలలో అవసరమైన సైడుకాలువలు అధిక సంఖ్యలో రద్దు కావడానికి ఇంజనీర్ల నిర్లిప్తత కారణమని, అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. నేటికి సచివాలయాల భవనాలకు స్థలం గుర్తించ లేకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. కామేపల్లి ఇసుకరేవులో నాణ్యమైన ఇసుక రావడం లేదని, దానిని రద్దు చేసి క్రొత్తరేవులు గుర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇసుక కొనుగోలు కోసం ఏర్పాటు చేసిన వెబ్‌సైట్‌లో 378 ఆర్డర్లు రాగా 3,822 మెట్రిక్ టన్నుల ఇసుక పెండింగ్‌లో వున్నట్లు ఆన్‌లైన్‌లో చూపడంపై ఆయన ఆరా తీశారు. సాంకేతిక సమస్యలు తక్షణమే పరిష్కరించాలన్నారు. గ్రామ సచివాలయాలలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తమ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి ప్రతివారం కలెక్టర్ కార్యాలయానికి నివేదిక పంపాలన్నారు. ప్రలోభాలకు గురికావద్దని నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చూడాలన్నారు. ఉపాధిహామీ పనులు పర్యవేక్షించడానికి ప్రతి నియోజకవర్గానికి ఉప కలెక్టర్‌లను నోడల్ అధికారిగా నియమిస్తున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.

ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ కె.నరేంద్రప్రసాద్, డ్వామా పి.డి. సీనారెడ్డి, జడ్.పి. సి.ఇ.ఓ. కైలాష్ గిరీశ్వర్ , ఆర్.డబ్ల్యు.ఎస్. ఎస్.ఇ. సంజీవరెడ్డి, పి.ఆర్. ఎస్.ఇ. కొండయ్య, వ్యవసాయ శాఖ జె.డి. శ్రీరామమూర్తి, హౌసింగ్ పి.డి. సాయినాథ్ కుమార్, నియోజకవర్గ, మండలస్థాయి ఇంజనీర్లు, తదితరులు పాల్గొన్నారు.

(సహాయ సంచాలకులు, సమాచార పౌర సంబంధాల శాఖ, ఒంగోలు వారిద్వారా జారీ చేయడమైనది. )